ముగిసిన సైబర్ మేనియా 2.0 ఫెస్ట్



అల్వాల్: లయోలా అకాడమీలో సైబర్ సెక్యూరిటీ విభాగం నిర్వహించిన సైబర్ మేనియా 2.0 ఫెస్ట్ గురువారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు డిబేట్, పీపీట్, క్విజ్, టైప్ రైటింగ్, బీజీఎంఐ, యానిమేటజ్, అంతర్జాతీయ సీటీఎఫ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సైబర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సందీప్ ముదాల్కర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ దాడుల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మల్కాజిగిరిలో అజంతా ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం



గౌతంనగర్: మల్కాజిగిరికి చెందిన ప్రయాణికుల సంఘం అభ్యర్థన మేరకు కాచిగుడ నుంచి వచ్చే అజంతా ఎక్స్‌ప్రెస్‌కు మల్కాజిగిరిలో రైల్వే అధికారులు హాల్ట్ సౌకర్యం కల్పించారు. దీంతో మంగళవారం రాత్రి అజంతా ఎక్స్‌ప్రెస్‌కు మల్కాజిగిరిలో డీఆర్‌యూసీసీ సభ్యులు నూర్, మల్కాజిగిరి ప్రయాణికుల సంఘం అధ్యక్షులు ఏ.వి.స్వామితో పాటు ప్రయాణికులు స్వాగతం పలికారు.

రూ.56.40 లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పట్టణంలోని 23 వార్డుల్లో చేసిన, చేస్తున్న అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో 21అజెండా అంశాలను రూపొందించి వాటిపై చర్చించారు. సమావేశంలో రూ.56.40 లక్షల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, అధికారులు, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కర సేవకులకు సన్మానం

మేడ్చల్: రామజన్మభూమి ఉద్యమంలో పాల్గొన్న మేడ్చల్‌కు చెందిన కర సేవకులను సన్మానించారు. నగరంలోని చింతల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ ప్రాంతం నుంచి అయోధ్యకు వెళ్లిన హిందూ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 12వ వార్డులో రూ.5 లక్షల మున్సిపాలిటీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ పావనీ జంగయ్య గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్మించాలని, యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, పద్మారావు, నాయకులు జంగయ్యయాదవ్, విజయ్, మారుతి, రవి, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కీసర: కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని కీసరగుట్ట కమాన్ సమీపంలోని ప్రభుత్వ, అటవీశాఖ స్థలంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అండదండలతో కొందరు భూకబ్జాదారులు అక్రమంగా కమర్షియల్ షటర్లు నిర్మిస్తున్నారని, ఈ నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేసి చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం కీసర గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రామిడి విజయ్‌రెడ్డి, ముద్దం వెంకట్, కాంగ్రెస్ నేతలు జూపల్లి రవీందర్, గుర్రం లక్ష్మారెడ్డిలు గ్రామ కార్యదర్శి గంగన్నకు ఫిర్యాదు చేశారు. సదరు నిర్మాణాలకు ఏవిధంగా అనుమతులు మంజూరయ్యాయో తమకు పూర్తి వివరాలు అందజేయాలన్నారు. త్వరలో డీపీఓ, జిల్లా కలెక్టర్, అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ వికలాంగుల కాలనీకి చెందిన పేదింటి ఆడబిడ్డ కౌసల్య వివాహానికి తెలంగాణ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో గురువారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతాంజలి, పరమేశ్వర్, రేఖ, సుజాత, అనుష, విజయ, నాగేశ్వర్‌రావు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికి తీసేందుకే ఫెస్ట్‌లు

మేడ్చల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కళాశాలల్లో నిర్వహించే ఫెస్ట్‌లు ఎంతో దోహద పడతాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ అరుంధతి అన్నారు. గిర్మాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సృజన టెక్ ఫెస్ట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక సదుపాయలను వినియోగించుకుని, పరిజ్ఞానం పెంచుకోవాలని అన్నారు. ఫెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు.

ఆడపిల్లలను అన్నింట్లో సమానంగా చూడాలి

మేడ్చల్: ఆడపిల్లలను అబ్బాయిలతో సమానంగా చూడాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు. మేడ్చల్ జెడ్పీ బాలికల పాఠశాలలో భేటీ బచావో భేటీ పడావో పథకంలో భాగంగా గురువారం జిల్లా మహిళా సాధికారం కేంద్రం ఆధ్వర్యంలో బాలికలకు తమ హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, సఖీ సర్వీసెస్, చైల్డ్ హెల్ప్‌లైన్, చైల్డ్ మ్యారేజ్, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, సోషల్ మీడియాతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సభ్యులు ప్రియాంక, సవిత, శ్రావణి, ప్రిన్సిపల్ సర్వస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టొద్దు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో సర్కారు భూమిలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేయించారు. సర్వే నంబర్–219, 289లోని సీలింగ్ పట్టా భూమిని ప్రభుత్వం కొంతమంది పేదలకు కేటాయించింది. అందులో వ్యవసాయం చేయకుండా ఇళ్లు నిర్మిస్తున్నారని కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు 219లో నిర్మించిన మూడు కట్టడాలు, 289లో నిర్మించిన నాలుగు కట్టడాలను కూల్చివేయించామని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు స్థలాలను కాజేస్తున్నారు..



పీర్జాదిగూడ పెద్దచెరువులో మట్టితో నింపి చదును చేస్తూ..



ఉప్పల్ నల్ల చెరువును మట్టితో పూడుస్తూ..

- రోజుకు కొంత మట్టితో నింపి స్థలం కబ్జా
- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాలను కలుపుకొని..
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణల పర్వం
- ఎన్నికల సమయంలో పట్టించుకోని అధికారులు
- నగర శివారుల్లో పలుచోట్ల అక్రమ నిర్మాణాలు
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జనం ఆగ్రహం

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారులో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు అర్బన్, సెమీ అర్బన్ పట్టణాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలుగా వేగంగా విస్తరిస్తుండటంతో అక్రమార్కుల కళ్లు చెరువులపై పడ్డాయి. వీటిని ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారైతే ఏకంగా చెరువులు, కుంటల సమీపంలో ఎకరం లేదా అరెకరం పట్టా భూమిని కొనుగోలు చేసి, పక్కనున్న బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాన్ని కలుపుకొని అపార్టుమెంట్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. పట్టణాల్లో ఇప్పటికే సగానికిపైగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అయ్యాయి. వీటిని పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది.

చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా..

చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి కాపాడేందుకు ప్రతి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీ వేసి పరిరక్షించాలని గతంలో హైకోర్టు పేర్కొంది. అందు కోసం కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ కమిటీలో పోలీసు అధికారులకు స్థానం కల్పించాలని ఆదేశించింది. కానీ మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా.. నామమాత్రంగానే పని చేస్తున్నాయి. పంచాయతీలు, పట్టణాల్లో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను ఇప్పటికీ ఈ కమిటీలు పూర్తిస్థాయిలో గుర్తించలేదు. కొన్నిచోట్ల గుర్తించినా ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లతో వాటిని తొలగించడం లేదు.

చెరువుల సరిహద్దులు గుర్తించినా..

శివారు జిల్లాలో ఏడు నగర పాలక సంస్థలు, 21 మున్సిపాలిటీలతో సహా గ్రామ పంచాయతీల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 476 చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దులు గుర్తించే ప్రక్రియలో భాగంగా మూడు శాఖలు సంయుక్తంగా జీపీఎస్ విధానంలో శాటిలైట్ సర్వే నిర్వహించి, సంబంధిత వివరాలను హెచ్ఎండీఏకు నివేదించింది.

మచ్చుకు కొన్ని..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో రా, చింతల చెరువుల్లోని బఫర్ జోన్లలో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా.. పట్టించుకునే వారే లేరు. అల్వాల్ మండలం యాప్రాల్లో బడాయికుంటను ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాంపల్లిలోని ఎర్రమల్లె వాగును ఆనుకుని ఉన్న ఎకరన్నర బఫర్ జోన్ స్థలాన్ని లేఅవుట్ చేసినా నీటి పారుదల శాఖ కిమ్మనడం లేదు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లో రెండు నాలాలను ఆక్రమించి వెంచర్ చేసినా పట్టించుకోవడం లేదు. ఫీర్జాదిగూడలో పెద్దచెరువు, ఉప్పల్‌లో నల్లచెరువు భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయి. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, జవహర్‌నగర్, నాగారం, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, మేడ్చల్, దుండిగల్, కొంపెల్లి, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలతో సహా సెమీ అర్బన్లుగా మారుతున్న గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పలు చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

– ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొ.కోదండరామ్, అసోసియేషన్ ప్రతినిధులు

ఉప్పల్: పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ సహకారం తప్పని సరిగా ఉండాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ అన్నారు. తెలంగాణ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ పారిశ్రామిక వాడ అసోసియేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చిన్న పరిశ్రమలు బిల్లుల విషయంలో చాలా నష్టపోయాయన్నారు. విద్యుత్ విషయంలో ఎలాంటి రాయితీలు ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సముచిత న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు తెలంగాణ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వానికి ప్రింటర్లు సహకరిస్తూ వచ్చినా తమ సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా దాదాపు రూ.20 కోట్ల బకాయిలు ఉన్నాయని, దీని వల్ల చిన్న పరిశ్రమ యాజమానులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కోదండరామ్ తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డి.వినోద్‌కుమార్, కోశాధికారి ఎ.ఉత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు అసోసియేషన్ అధ్వర్యంలో కోదండరామ్‌ను శాలువాతో సత్కరించారు.

లింక్ క్లిక్ చేస్తే.. అంతే సంగతులు

- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు



సైబర్ సేఫ్టీ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మల్లాపూర్: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు అన్నారు. గురువారం నాచారం రాఘవేంద్రనగర్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో సైబర్ సేఫ్టీపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ, డీసీపీలు మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న ఆన్‌లైన్, సైబర్ నేరాల తీరుపై వివరించారు. సోషల్ మీడియాలో వస్తున్న లింక్‌లను ఎవరూ క్లిక్ చేయవద్దన్నారు. పొరపాటున కూడా ఓటీపీలను అపరిచిత వ్యక్తులకు చెప్పవద్దన్నారు. సైబర్ మోసాల్లో ఎక్కువగా విద్యార్థులు బలవుతున్నారన్నారు. యువతులు, మహిళలను ఎవరైనా వేధిస్తే వెంటనే షీటీమ్స్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాచకొండ పోలీస్ హెల్ప్‌లైన్ వాట్సాప్ నంబర్: 87126 62111, సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్స్, ఉమెన్ సేఫ్టీ, డీసీపీ ఉషావిశ్వనాథ్, ఎస్ఐ రాజు, కమలాభాయ్, యాదగిరి, శిల్ప, లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ పాలస్తీనా శాంతియుత సహజీవనం చేయాలి



గాజా యుద్ధంలోని చిన్నారులకు సంఘీభావంగా క్రిస్మస్ వేడుకలు

ప్రొఫెసర్ కంచె ఐలయ్య

రామంతాపూర్: మౌంట్‌ఫోర్టు సోషల్ ఇనిస్టిట్యూట్‌లో గురువారం గాజా యుద్ధం క్షేత్రంలోని చిన్నారులకు సంఘీభావం, నైతిక మద్దతు తెలుపుతూ వివిధ విభాగాలకు చెందిన కళాకారులు, కవులు, ట్రాన్స్‌జెండర్లు, ప్రముఖుల ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిటిజెన్స్ ప్రతినిధి, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత సజయ కాకర్ల, ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గాజాలో పిల్లలు ఎదుర్కొంటున్న బాధాకరమైన, కదిలించే పరిస్థితుల గురించి మనసులను కదిలించడటానికి ఈ కార్యక్రమం నిర్వహించడంతో ఆ చిన్నారులకు నైతిక మద్దతు లభిస్తుందన్నారు. ఈ యుద్ధానికి ముగింపు ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాలు శాంతియుత సహజీవనం చేయడం ఒక్కటే పరిష్కారం అన్నారు. అనంతరం కళాకారులు కార్టూనిస్టులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గాజాలోని చిన్నారులకు సంఘీభావం తెలిపారు. కార్టూనిస్టులు శ్రీనివాస్, నివాస్, షాహీన్, గజల్ కళాకారులు, ఎంసీఏ డైరెక్టర్ వర్గీస్ టిక్కానాథ్, యూఎస్ కాన్సులేట్ యూత్ ఎఫైర్స్ అధికారి క్రిస్టోఫర్, రచయిత జర్నలిస్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి నింపిన వ్యక్తిపై కేసు

మేడిపల్లి: చెరువులో అక్రమంగా మట్టిని నింపి కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తిపై మేడిపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మేడిపల్లి మండలం పీర్జాదిగూడ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా మట్టిని నింపి చెరువును పూడ్చి కబ్జాలకు పాల్పడుతున్నారని ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.. దీంతో స్పందించిన సంబంధిత మేడిపల్లి ఇరిగేషన్ ఏఈ పరమేష్ మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువు పరిసరాలు, బఫర్ జోన్‌లో మట్టి నింపి కబ్జాకు యత్నిస్తున్నారంటూ.. వెంటనే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపిన పోలీసులు పల్ల శ్రీనివాస్‌రెడ్డి అక్రమంగా మట్టిని నింపి కబ్జాకు యత్నిస్తున్నాడని గుర్తించారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మల్లాపూర్: రెడ్‌క్రాస్ సొసైటీ, సీనియర్ సిటిజన్స్ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మల్లాపూర్ ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో 57 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్ బాబు తెలిపారు. మరిన్ని వివరాల కోసం పీఎస్ఎన్ చౌదరి ఫోన్: 93488 24648, శేఖర్‌బాబు ఫోన్: 98491 10418 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



అల్వాల్: అల్వాల్ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం దేవస్థానం ఆవరణంలో కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వంశపారపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సంచార్, కార్యనిర్వాహణ అధికారి మఠం వీరేశం తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, శివరామక్రిష్ణ, సురేందర్‌రెడ్డి, రాము, నాగేష్, ఆలయ పూజారులు విజయసారథి, శ్రీనివాస్ పంతులు, వంశీపంతులు, రమణ పంతులు, గోపాల్ పంతులు పాల్గొన్నారు.

వైవిధ్యభరిత కంటెంట్‌తో గ్లాన్స్

సాక్షి, సిటీబ్యూరో: ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్స్ వినియోగదారులకు గ్లాన్స్ స్మార్ట్ లాక్ స్క్రీన్స్ ద్వారా వైవిధ్యభరితమైన కంటెంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ఆధార సాఫ్ట్‌వేర్‌తో వీటిని అందిస్తున్నామని, దీనిలో వినోదం, షాపింగ్, సంగీతం, బిజినెస్.. తదితర 15 రకాల విభిన్న కేటగిరీల్లో కంటెంట్‌ను ఆస్వాదించవచ్చని వివరించారు. తాజాగా తెలుగు బిగ్‌బాస్ వీక్షకులకు సైతం అందించామన్నారు. సెర్చ్ చేయడం లేదా యాప్ డౌన్‌లోడ్ చేసే అవసరం లేకుండా నేరుగా ఫోన్ మీది పవర్ బటన్ ప్రెస్ చేయడం ద్వారా ఈ కంటెంట్‌ను అందుకోవచ్చన్నారు.

రోజ్‌గారి భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

కీసర: చీర్యాల గ్రామంలో రోజ్‌గారి భవనాన్ని పునర్నిర్మించిన సందర్భంగా ఇదివరకే లైబ్రరి ఉన్న మొదటి అంతస్తులో మళ్లీ అధునాతన లైబ్రరీ ఏర్పాటు చేయాలని 5 సంవత్సరాలుగా గ్రామసభలో తీర్మాణాలు చేయించామని ఇప్పటికైనా కొత్తగా నిర్మించిన రోజ్‌గారి భవనంలోని రెండో అంతస్తును గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని, రోజ్‌గారి భవనానికి విద్యుత్ కనెక్షన్ పనులను పూర్తిచేయాలని గురువారం గ్రామకార్యదర్శి భాస్కర్‌కు గ్రామస్తులు నవీన్‌యాదవ్, ఏలూరిరాజు, బక్కని కుమార్‌లు వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్ ధర్నాను విజయవంతం చేయాలి

మేడ్చల్: పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టిన ధర్నాలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి కోరారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు అన్ని నియోజకవర్గాల నాయకులు తరలిరావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు



ఉప్పల్‌లో మాట్లాడుతున్న బండారు లక్ష్మీనారాయణ

ఉప్పల్: చట్టసభల్లో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి సంచార పీఠం 9వ పీఠాధిపతి బండారు లక్ష్మీనారాయణ గుప్తా ప్రభుత్వాన్ని, రాజకీయ పార్టీలను కోరారు. ఈ మేరకు గురువారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు లభించిందన్నారు. రోషయ్యకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారని, ఇప్పుడు డీజీపీగా రవిగుప్తాకు అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు ఎంపీ సీట్లు కేటాయించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రిగా అవకాశం కల్పించాలని కోరారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి



మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరుతూ కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ గురువారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. రామ్‌రెడ్డినగర్‌లో ట్రంక్‌లైన్ పనులు, ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్ట్ పనులు, సాయిచిత్రనగర్‌లో యూజీడీ పనులు, మూసీ నది సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె వినతిపత్రంలో కోరారు. పెండింగ్ పనులను త్వరలో పూర్తిచేస్తామని మేయర్ విజయలక్ష్మీ తెలిపినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో క్రిస్మస్ వేడుకలు



జిల్లా కోర్టులో క్రిస్మస్ వేడుకల్లో న్యాయమూర్తులు

కుషాయిగూడ: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కోర్టులో గురువారం మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పీఆర్ఎల్ అండ్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి బీఆర్ మధుసూదన్‌రావు అడిషనల్ డిస్ట్రిక్, ఫోక్సో జడ్జి జె.విక్రమ్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సందడిగా సాగిన క్రిస్మస్ వేడుకల్లో న్యాయవాదులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్‌కుమార్, సెకండ్ అడిషనల్ సీనియర్ జడ్జి జి.వి.మహేష్‌నాథ్, సెకండ్ జూనియర్ సివిల్ జడ్జి దేవి మానస, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి చీరాగ్ మెహతా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రాంచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కాప్రా: ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం కాప్రాలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాప్రా డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సర్వేపల్లి రవి కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం అనాథాశ్రమంలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అయప్ప, క్రిష్ణమూర్తి, సత్యానారాయణ, బసవిరెడ్డి, పవన్, ప్రవీణ్‌కుమార్, శంకర్‌రెడ్డి, ప్రసాద్, నాగమణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఏఐ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ప్రముఖ పాత్ర పోషిస్తుందని సీనియర్ టెక్నికల్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాస్ కొంగర అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం, ఎనిగ్మా ఐఎస్‌టీఈ రెస్కిల్ సహకారంతో గురువారం నిర్వహించిన 'కోడ్ విత్అవుట్ బ్యారియర్స్' ఈవెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.